

టెక్ టాక్

సోడాబండి దగ్గర యూపీఐ ఐడీ, పూలకొట్టులో స్కానర్, పాన్‌డబ్బాలోనూ డిజిటల్ పేమెంట్ మోడ్.. ఇలా నగదు లావాదేవీలన్నీ డిజిటల్ రూపాన్ని సంతరించుకున్నాయి. 2026 నాటికి ఇండియాలో డిజిటల్ చెల్లింపుల విలువ రూ.830 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. అయితే, పది రూపాయలు చెల్లించడానికి కూడా ఫోన్ పే స్కానర్ వాడుతున్న కామన్‌మ్యాన్‌కు డిజిటల్ అక్షరాస్యత అంతంత మాత్రమే! డిజిటల్ సౌలత్‌ను ఉపయోగించుకోవడం తెలియక దౌలత్ అంతా కోల్పోయిన బాధితులు ఎందరో! అలాంటి కష్టం మీకు రావొద్దంటే ఆన్‌లైన్ లావాదేవీల్లో ఏమరుపాటు తగదని గుర్తుంచుకోండి.

# ఈజీ పేమెంట్స్‌లో.. ఊహించని చిక్కులు!

'పైసా మే పరమాత్మా హై' అంటారు. పరమాత్మకు శతకోటి రూపాలు ఉన్నట్టు. రూపాయలూ కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సిక్కాలు హుండీలకు భారమవుతున్నాయి. తేలికైన కరెన్సీనోట్లను కూడా జేబు మోయనంటున్నది. అన్నిచోట్లా డిజిటల్ పేమెంట్లకే అగ్రతాంబూలం. అందుకే ఆటో కిరాయి నుంచి గగనయానం వరకు అంతటా ఆన్‌లైన్ చెల్లింపులు అప్రతిహతంగా సాగిపోతున్నాయి. కోట్ల మంది జీవితాల్లో ఇప్పుడు భాగమైపోయాయి. ఒకే క్లిక్‌తో ద్రవ్యసేవలను యాక్సెస్ చేసుకుంటున్నారు. మనదేశంలో ఆర్టీజీ, ఎన్ఈఎఫ్‌టీ, ఐఎమ్‌పీఎస్, రూపే, యూపీఐ చెల్లింపు వ్యవస్థలు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ద్వారా జరుపుకొంటాయి. పండ్లున్న చెట్టుకే రాళ్లన్నట్లు సౌలభ్యం ఉన్నచోటే సమస్యలూ ఉంటాయి. ఆన్‌లైన్ లావాదేవీల్లో చిన్న ఏమరుపాటు పెద్ద నష్టానికి దారితీసే ప్రమాదం ఉంది. ఫిషింగ్, కీలాగింగ్, స్పైవేర్, మాల్‌వేర్ వంటి సైబర్ దాడులు పొంచి ఉంటాయి. సోషల్ ఇంజినీరింగ్ నేరాలకూ యూపీఐ గేట్‌వేగా మారుతున్నది. అయితే, సైబర్ మాయగాళ్లు ఈ తరహా మోసాలకు ఎలా పాల్పడతారో వినియోగదారులు కనీస అవగాహన కలిగి ఉండాలి. డబ్బులు చెల్లించే సమయంలో ఎవరికి పంపుతున్నామో స్పష్టత చాలా అవసరం. గుడ్డిగా మీట నొక్కేసి 'అయ్యయ్యో' అనుకుంటే కుదరదు. డిజిటల్ లావాదేవీల్లో తప్పులు దొర్లినా, మోసానికి గురైనా వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించాలి. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం బలమైన మార్గదర్శకాలను రూపొందించింది. అంతేకాదు ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని పటిష్ఠపరిచింది.

**ఆధార్ ఆధారంగా..**

ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ అంటే.. లావాదేవీలకు ఆధార్ కీలకం. ఎన్‌పీసీఐ దీనిని అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు ఆధార్ నంబర్, ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కానింగ్‌తో ధ్రువీకరించిన తర్వాతే ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. తద్వారా డిజిటల్ దాడుల తీవ్రత తగ్గుతుంది. ఆధార్ ఆధారంగా బ్యాంకు ఖాతాను సులభంగా యాక్సెస్ చేయొచ్చు. నగదు ఉపసంహరణ, డిపాజిట్, బ్యాలెన్స్ విచారణ, ఆధార్ నుంచి ఆధార్‌కు నిధుల బదిలీ, మినీ స్టేట్‌మెంట్, ఇ-కేవైసీ తదితర సేవలన్నీ ఆధార్ ద్వారా నిర్విఘ్నంగా కొనసాగించొచ్చు. అయితే, ఆధార్‌ను సాధనంగా చేసుకొని సైబర్ మోసాలకు పాల్పడుతున్న స్కామర్లు కోకొల్లలు. ఖాతాదారుల ఆధార్‌ను ఫోర్జరీ చేసి వివిధ రకాల లైసెన్స్‌లు పొందడమే కాకుండా, సిమ్ కార్డులూ కొనుగోలు చేస్తుండటం గమనార్హం. మీకు ప్రమేయం లేకుండా ఒక్క రూపాయి లావాదేవీ జరిగినట్టు మీ దృష్టికి వచ్చినా బ్యాంకు అధికారులను సంప్రదించాలి. కస్టమర్ కేర్ సేవలను వినియోగించుకోవడం తప్పనిసరి.

తక్కువ మొత్తమే కదా
అని పట్టించుకోకుండా ఉంటే...
తర్వాత పెద్ద దెబ్బ పడే ప్రమాదం ఉంది.

**తెలుసుకోకుండా పంపొద్దు..**

ఇప్పుడు ఎక్కడ చూసినా గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్ సేవలే! ఈ యూపీఐ పేమెంట్ ప్లాట్‌ఫామ్ సాయంతో సెకండ్ల వ్యవధిలో లావాదేవీలు చక్కబెడుతున్నారు. ఈ తరహా ఆర్థిక లావాదేవీలకు రుసుం చెల్లించాల్సిన పనిలేదు. క్రెడిట్ కార్డును కూడా యూపీఐకి లింక్ చేసుకోవచ్చు. యూపీఐ ద్వారా క్రెడిట్ కార్డు కూడా ఫ్రీగా ఉపయోగించుకోవచ్చు. అయితే, క్రెడిట్ కార్డు నుంచి బ్యాంకు ఖాతాలోకి యూపీఐ ద్వారా డబ్బులు పంపాల్సి వస్తే.. కనీస చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. క్రెడిట్ కార్డు నుంచి యూపీఐ వాలెట్‌కు డబ్బులు పంపించుకునే వెసులుబాటూ ఉంది. ఇవన్నీ బాగానే ఉన్నా.. డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం వల్ల యూపీఐ పేమెంట్లలో మోసాలకు గురవుతున్నారు. ఓటీపీ షేర్ చేయడం ద్వారా కొంప కొల్లేరైందన్న వార్తలు రోజూ చదువుతూనే ఉన్నాం. కనిపించింది కదా అని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. డబ్బులు పంపిస్తుంటాం. కానీ, ఎవరికి పంపుతున్నామో తెలుసుకున్నాక గానీ, ట్రాన్స్‌ఫర్ చేయొద్దని గుర్తుపెట్టుకోండి. ■

**డిజిటల్ లావాదేవీల్లో మోసానికి గురైతే స్థానిక సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించండి. మీరు నిర్వహించిన లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్ షాట్లు ఫిర్యాదుకు జతచేయండి.** https://www.cybercrime.gov.in **వెబ్ లింక్ ద్వారా గానీ, టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి గానీ కూడా ఫిర్యాదు చేయొచ్చు.**



**అనిల్ రాచమల్ల**
వ్యవస్థాపకులు
ఎండ్‌నౌ ఫౌండేషన్